ప్రకాశం జిల్లా తేది:24.04.2024

అర్హులైన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పండుగ వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి శ్రీ.ఏ.ఎస్.దినేష్ కుమార్ ఐఏఎస్ గారు చెప్పారు. ఎన్నికలకు ఆటంకము కలిగించాలని ఎవరైనా చూస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గారు హెచ్చరించారు. ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై బుధవారం రాత్రి దర్శి మండలంలోని రాజంపల్లి లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ.గరుడ్ సుమిత్ సునీల్ ఐపీఎస్ గారితో కలిసి కలెక్టర్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్లను ప్రభావితం చేసేలా డబ్బు, మద్యం, ఇతర వస్తువులు ఏమైనా పంపిణీ చేసినట్లుగా గమనిస్తే వెంటనే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలనీ సూచించారు. ఇలాంటి ప్రలోభాలను అడ్డుకోవటానికి జిల్లాలో 27 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు తిరుగుతున్నాయన్నారు. దర్శిలో 9 టీములు మూడు షిఫ్టులుగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రలోభాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. స్థానికంగా నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో 3500 మందికి పైగా ఓటర్లు ఉన్నారని, వీరిలో 11 మందిని వికలాంగులుగా గుర్తించామని చెప్పారు. వికలాంగులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, అదేవిధంగా పోలింగ్ కేంద్రానికి రాలేని 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ సదుపాయాన్ని కూడా తెచ్చామని వివరించారు. దర్శి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 92% పోలింగ్ నమోదు అయినదని, ఈసారి 100% పోలింగ్ నమోదయ్యేలా ప్రతి ఒక్కరు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజంపల్లిని జిల్లా కలెక్టర్, తాను ప్రత్యేకంగా ఇక్కడకు వచ్చామన్నారు. ఎలాంటి అవాంఛనీయలు సంఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక పోలీస్ స్పాట్ టీం కూడా విధులు నిర్వహిస్తుందని తెలిపారు. స్థానికుల్లో ధైర్యం నింపేలా ఇప్పటికే గ్రామస్థాయిలో పోలీస్ కవాతు కూడా నిర్వహించామన్నారు. శాంతిభద్రతలకు, పోలింగుకు ఆటంకం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఫిర్యాదులు మరియు సహాయం కోసం సి-విజిల్, సాక్ష్యం యాప్ లను సమర్థంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని కలెక్టర్, ఎస్పీ ఈ సందర్భంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా వాటిని ఎదుర్కొనేలా తాము ఉంటామని స్వాట్ టీము ఈ సందర్భంగా ప్రత్యేక డెమో ప్రదర్శన నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ.శౌర్య మన్ పటేల్, దర్శి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీ.లోకేశ్వరరావు, డీఎస్పీ అశోక్ వర్ధన్, దర్శి సీఐ షమీవుల్లా, స్థానిక తాసిల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దీనికి ముందుగా తూర్పు వీరాయపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.








